www.prajasakti.com

ప్రజాశక్తి

గురువారం 7 మార్చి 2024 5 కాకినాడ

ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా గుణ్ణం, పేరాబత్తుల

ప్రజాశక్తి - కాకినాడ

టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శులుగా కాకినాడ నగరానికి చెందిన గుణ్ణం చంద్రమౌళి, మాజీ జడ్‌పిటిసి సభ్యులు పేరాబత్తుల రాజశేఖర్ నియమితులయ్యారు. టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడు ఈ మేరకు నియామక ఉత్తర్వులను బుధవారం జారీ చేశారు. మూడు దశాబ్దాలకుపైగా టిడిపిలో క్రియాశీలకంగా పని చేస్తున్న చంద్రమౌళి, రాజశేఖర్ జరువురు గత నాలుగున్నరేళ్లుగా ప్రతిపక్షంలో టిడిపి తరఫున అనేక పోరాటాలు చేస్తూ వస్తున్నారు. టిడిపి అధినేత చంద్రబాబు నాయుడి బాదుడే బాదుడు, ఇదేంఖర్మ మన రాష్ట్రానికి, టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ కార్యక్రమాలను కాకినాడ జిల్లాలో విజయవంతం చేయడంలో గుణ్ణం, పేరాబత్తుల కీలక పాత్ర పోషించారు. వీరి నియామకాల పట్ల టిడిపి శ్రేణులు హర్షం వ్యక్తం చేశాయి.

నిలిచేది ఎవరు, గెలిచేది ఎవరు.?

- టిడిపి నుంచి 3వ సారి బరిలో చినరాజప్ప
- ఖరారు కాని వైసిపి అభ్యర్థిత్వం
- పెద్దాపురంలో ఆసక్తికరంగా మారిన రాజకీయం

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి, పెద్దాపురం

చారిత్రాత్మకంగానూ, ఆధ్యాత్మికంగానూ పేరొందిన పెద్దాపురం నియోజకవర్గంలో రాజకీయ పరిణామాలు వేడెక్కుతున్నాయి. 3వసారి మాజీ హోంమంత్రి, టిడిపి సిట్టింగ్ ఎంఎల్‌ఎ నిమ్మకాయల చినరాజప్ప ఇక్కడ నుంచి బరిలో నిలుస్తున్నారు. ఇప్పటికే ఆయన అభ్యర్థిత్వం ఖరారు అయింది. అదే సందర్భంలో వైసిపి నుంచి హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ దవులూరి దొరబాబు పోటీలో నిలబడే అవకాశం కనిపిస్తుంది. అధిష్టానం నుంచి అధికారిక ప్రకటన మాత్రం ఇంకా రాలేదు. ఈ నేపథ్యంలో ఇక్కడ నిలిచేది ఎవరు, గెలిచేది ఎవరు అంటూ నియోజకవర్గ వ్యాప్తంగా చర్చ సాగుతోంది. ఈ నియోజకవర్గంలో 6 సార్లు కాంగ్రెస్, 6 సార్లు టిడిపి, 2సార్లు సిపిఐ, ఒకసారి ప్రజారాజ్యం నుంచి ప్రజాప్రతినిధులుగా ప్రాతినిధ్యం వహించారు. ప్రస్తుతం నిమ్మకాయల చినరాజప్ప రెండోసారి ఎంఎల్‌ఎగా ఉన్నారు. 3వసారి గెలిచి హ్యాట్రిక్ సాధించేందుకు సిద్ధపడుతున్నారు. గడచిన సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా వైసిపి భారీ సీట్లను దక్కించుకోగా ఇక్కడ మాత్రం చినరాజప్ప రెండోసారి టిడిపి జెండాను ఎగురు వేశారు. టిడిపి పాలనలో నియోజకవర్గాన్ని మంత్రి హోదాలో బాగా అభివృద్ధి చేయడంతో ఇక్కడి ఓటర్లు రెండోసారి అవకాశం ఇచ్చారు. అయితే వైసిపి అధికారంలో ఉండడంతో రెండోసారి గెలిచినప్పటికీ అభివృద్ధికి ఒక్క రూపాయి కూడా నిధులను ఖర్చు చేసే అవకాశం రాలేదు. ఇదే విషయాన్ని ఆయనే స్వయంగా పలుమార్లు చెప్పుకున్నారు. ఈ నేపథ్యంలో 3వసారి ప్రజలు ఆశీర్వదించాలని ముందుకు సాగుతున్నారు. కాపు సామాజిక వర్గానికి చెందిన రాజప్ప సొంత నియోజకవర్గం అమలాపురం. అది ఎస్‌సి రిజర్వుడు కావడంతో ఆయన గతంలో ఎంఎల్‌సిగా ప్రజలకు సేవలు అందించారు. కొన్ని రాజకీయ సమీకరణాలు నేపథ్యంలో కోనసీమకు చెందిన ఆయన అనూహ్యంగా పెద్దాపురం నుంచి పోటీ చేయాల్సి వచ్చింది. ఈ సారైనా ఇక్కడ నుంచి సీటు దక్కుతుందని మాజీ ఎంఎల్‌ఎ బొడ్డు భాస్కర రామారావు కుమారుడు బొడ్డు వెంకటరమణ చౌదరి, ప్రముఖ కాంట్రాక్టర్ చంద్రమౌళి సీటు ఆశిస్తూ వచ్చారు. రాజప్పకు టిక్కెట్టు దక్కకుండా పలు సందర్భాల్లో పావులు కదిపారు. ఒక వర్గంగా ఏర్పడి తమకే టికెట్ దక్కాలని ఉద్దేశంతో నియోజకవర్గంలో వివిధ కార్యక్రమాలను కూడా చేపట్టారు. ఎలాగైనా చిన్న రాజప్పను తప్పించి పోటీ చేయాలని భావించారు. అయితే చంద్రబాబు ఇటీవల తన పర్యటనలో భాగంగా ఇక్కడ మూడోసారి రాజప్పే పోటీ చేయనున్నట్లు బహిరంగ సభలో ప్రకటించారు. దాంతో బొడ్డు వెంకటరమణ చౌదరి, చంద్రమౌళి ఆశలు అడియాసలయ్యాయి. ఈ నేపథ్యంలో వారు రాజప్పకు సహకరించే అవకాశాలు చాలా తక్కువగా ఉన్నట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. మరోవైపు పొత్తు పార్టీగా ఉన్న జనసేన కార్యకర్తలు అసంతృప్తితో ఉన్నారు. తమ్మయ్య బాబుకి పొత్తులో సీటు దక్కుతుందని ఆశించి భంగపడ్డారు. దీంతో ఆయు జనసేన నుంచి, ఇటు సొంత పార్టీలోని కేడర్ నుంచి ఏ మేరకు సహకారం ఉంటుందనేది దానిపై ఆయోమయంలో రాజప్ప కొనసాగుతున్నారు.

గత ఎన్నికల్లో వైసిపి నుంచి దవులూరి దొరబాబు టికెట్ ఆశించి భంగపడ్డారు. టిడిపి నుంచి పార్టీలోకి చేరిన మాజీ కాకినాడ ఎంపి తోట నరసింహం సతీమణి ఆ పార్టీ నుంచి ఇక్కడ బరిలో నిలవడంతో దొరబాబు తీవ్ర ఆవేదనకు లోనయ్యారు. పరోక్షంగా వైసిపికి సహకరించలేదని ఆరోపణలు అప్పట్లో వినిపించాయి. ఈసారి టిక్కెట్టు దొరబాబు ఆశిస్తున్నారు. జగనన్న వసరత్నాలు పేదలందరికీ ఇళ్ల పథకంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సిఎం మాట్లాడుతూ దొరబాబుని ఆశీర్వదించాలని కోరారు. దాంతో టికెట్టు తనకే దక్కుతుందని ఆశాభావంతో అనేక కార్యక్రమాల్లో ఆయన చురుగ్గా పాల్గొంటున్నారు. ఈ నేపథ్యంలో ముద్రగడ వైసిపిలోకి చేరతారంటూ ప్రచారం మొదలైంది. ఇప్పటికే ముహూర్తం కూడా ఖరారు అయినట్లు తెలుస్తుంది. దాంతో పెద్దాపురం టిక్కెట్టు ముద్రగడకు గనుక ఇస్తే ఇక్కడ ఇన్‌ఛార్జ్‌గా ఉన్న కాకినాడ ఎంపి వంగా గీత పెద్దాపురం నుంచి పోటీ చేసే అవకాశాలు ఉన్నాయని ప్రచారం జరుగుతుంది. ఈ సందర్భంలో కాకినాడ పార్లమెంటు బరిలో వైసిపి నుంచి పోటీ చేయనున్న చలమలశెట్టి సునీల్ పెద్దాపురం అభ్యర్థి మార్పుపై అధిష్టానంతో చర్చించినట్లు ప్రచారం జరుగుతుంది. ఇక్కడ తోట నాయుడికి టికెట్ కేటాయించాలని, అతనికే గెలుపు అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని సునీల్ చెప్పినట్లు సమాచారం. దవులూరి దొరబాబు తండ్రి వలన వైసిపి స్థానికంగా పట్టు కోల్పోయిందనే ప్రచారం ఆ పార్టీ శ్రేణుల్లో ఉంది. దాంతో దవులూరి అభ్యర్థిత్వంపై అనుమానాలు ఇంకా వీడలేదు. ఈ నేపథ్యంలో కాపు సామాజిక వర్గ ప్రజలు అత్యధిక సంఖ్యలో ఉన్న ఈ నియోజకవర్గంలో ఎవరి బలాలు ఎలా ఉన్నాయనేది త్వరలో జరగబోయే ఎన్నికల్లో తేలనుంది.

జిజిహెచ్ ఆవరణలో శానిటేషన్ వర్కర్ల ఆందోళనలో మాట్లాడుతున్న బేబిరాణి

శానిటేషన్ వర్కర్స్ సమస్యపై కలెక్టర్ స్పందించాలి

ప్రజాశక్తి - కాకినాడ

కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రిలో సేవలందిస్తున్న శానిటేషన్ వర్కర్స్ సమస్యలపై జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకోవాలని సిఐటియు జాతీయ ఉపాధ్యక్షురాలు జి.బేబీరాణి డిమాండ్ చేశారు. శానిటేషన్ వర్కర్స్ చేస్తున్న ఆందోళన బుధవారం నాటికి 32వ రోజుకు చేరింది. తొలుత మాతా శిశు విభాగం నుంచి ఓపి విభాగం వరకూ శానిటేషన్ వర్కర్లు నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్మికుల నిరసనలో ఆమె పాల్గొని మాట్లాడారు. శానిటేషన్ వర్కర్ లేకుండా జిజిహెచ్‌లో వైద్య సేవలు ఊహించలేమన్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా కృష్ణా కన్స్ట్రక్షన్ ప్రయివేట్ లిమిటెడ్ సంస్థ యజమానులు చెల్లించాల్సిన పిఎఫ్, ఇఎస్ఐ వాటాను కార్మికుల జీతాల నుంచి చెల్లించడం విడ్డూరంగా ఉందన్నారు. నెల రోజులుగా కార్మికులు ఆందోళన చేస్తున్నా అధికారుల్లో ఏమాత్రం చలనం లేకుండా పోయిందన్నారు. కాంట్రాక్టు సంస్థ నిర్లక్ష్యం వహిస్తే కాంట్రాక్టు రద్దు చేసి, కార్మికులకు సూపరింటెండెంట్ ద్వారా జీతాలు చెల్లించే అవకాశం ఉందన్నారు. అసుపత్రి అభివృద్ధి మండలి చైర్మన్‌గా కలెక్టర్ జోక్యం చేసుకుని కార్మికులకు న్యాయం చేయాలన్నారు. విజయం సాధించే వరకు పోరాటం కొనసాగించాలని పిలుపు ఇచ్చారు. సిఐటియు అనుబంధ సంఘాలు జిజిహెచ్ శానిటేషన్ వర్కర్స్‌కు అండగా నిలబడతాయన్నారు. ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రమళ్ల పద్మ కార్మికులకు సంఘీభావం తెలిపారు. అనంతరం జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ విజయ్‌ని కలిసి మరోసారి లిఖితపూర్వకంగా సమ్మె నోటీసును అందించారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ మాట్లాడుతూ కాంట్రాక్టు సంస్థ ప్రతినిధులను పిలిపించి కార్మికుల సమస్యను పరిష్కారం చేయాలని ఆదేశాలు ఇచ్చామన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కోశాధికారి మలక వెంకటరమణ, నగర అధ్యక్షుడు పలివెల వీరబాబు, యూనియన్ నాయకులు జె.శేషు, ఆర్.రమేష్, ఎస్.వాసు, శ్రీకాంత్, పాల్గొన్నారు.

రైతుల ఖాతాల్లో ఇన్‌పుట్ సబ్సిడీ జమ

ప్రజాశక్తి - కాకినాడ

గత డిశంబరు నెలలో మిచాంగ్ తుఫాను కారణంగా జిల్లాలో పంటలు నష్టపోయిన 29,730 మంది వ్యవసాయ, ఉద్యాన రైతులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.23.05 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీ అందించిదని కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా తెలిపారు. బుధవారం సిఎం జగన్ తాడేపల్లి నుంచి మిచాంగ్ తుఫాను ప్రభావంతో పంట నష్టపోయిన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీని జమ చేసేందుకు బటన్ నొక్కారు. కలెక్టరేట్ కార్యాలయం నుంచి జెసి సివి.ప్రవీణ్‌ఆదిత్యతో కలిసి కలెక్టర్ రైతులకు మెగా చెక్‌ను అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 13,006.07 హెక్టార్ల విస్తీర్ణంలో వ్యవసాయ పంటలు నష్టపోయిన 27,980 మంది రైతులకు రూ.21 కోట్ల 98 లక్షల మొత్తాన్ని, 533.894 హెక్టార్లలో ఉద్యాన పంటలు నష్టపోయిన 1750 మంది రైతులుకు ఒక కోటీ 6 లక్షల 56 వేల 532 రూపాయలు రాయితీ మొత్తాలను పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ప్రకతి విపత్తుల వల్ల నష్ట పోయిన రైతులకు సత్వర ఉపసమనం కల్పిస్తూ ఏ సీజన్‌లో జరిగిన పంటనష్టానికి అదే సీజన్ ముగిసేలోపే నష్ట పరిహారాన్ని ప్రభుత్వం అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి జెడి ఎన్.విజయ్ కుమార్, జిల్లా ఉద్యాన అధికారి నేతల మల్లికార్జునరావు, వ్యవసాయ, ఉద్యాన అధికారులు, లబ్ధిదార రైతులు పాల్గొన్నారు.

రైతులకు మెగా చెక్కును అందిస్తున్న కలెక్టర్

పరీక్షలకు సంసిద్ధం కావాలి

ప్రజాశక్తి - తాళ్లరేవు

ఈ నెల 18 నుంచి జరుగనున్న 10వ తరగతి పరీక్షలకు విద్యార్థులు సంసిద్ధంగా ఉండాలని ఎస్ఎస్ఎ ప్లానింగ్ కోఆర్డినేటర్ ఎం. సుబ్రహ్మణ్యం సూచించారు. మండల పరిధిలోని లక్ష్మీపతి పురం, గాడిమొగ, పి.మల్లవరం, బొడ్డు చిన వెంకటాయ పాలెం జడ్‌పి హైస్కూల్స్‌ను ఆయన బుధవారం సందర్శించారు. పాఠశాలలో అమలు చేస్తున్న వివిధ కార్యక్రమాలను సమీక్షించారు. పరీక్షలను ఎదుర్కొనేందుకు సిద్ధం కావాలని, పరీక్షల్లో మంచి ఫలితాలను సాధించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ ఎం.ఉమ, హెచ్ఎంలు విజయలక్ష్మి, త్రిమూర్తులు, శ్రీనివాస్, సాయి ప్రసాద్‌పాల్గొన్నారు.

విద్యార్థులతో మాట్లాడుతున్న సుబ్రహ్మణ్యం

11న కలెక్టరేట్ వద్ద గోపాలమిత్రల ధర్నా

ప్రజాశక్తి - కాకినాడ

సమావేశంలో మాట్లాడుతున్న రాజు

గోపాల మిత్రలకు ఉద్యోగ భద్రత కల్పించాలనే డిమాండ్‌తో ఈ నెల 11న కలెక్టరేట్ వద్ద ధర్నాను నిర్వహిస్తున్నట్లు గోపాలమిత్ర సర్వీస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సిహెచ్.రాజు తెలిపారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో పాడి రైతులకు సేవలు అందిస్తున్న గోపాలమిత్రకు ఉద్యోగ భద్రత లేకుండా పోయిందన్నారు. కష్టపడి రైతులకు సేవలందిస్తున్న కనీస వేతనం దక్కడం లేదన్నారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజ్ కుమార్ మాట్లాడుతూ 2019 నుంచి ఎఐ ఇన్సెంటివ్స్ చెల్లించడాన్ని ప్రభుత్వం నిలిపివేసిందని తెలిపారు. తెలంగాణాలో రూ.10వేలు చెల్లిస్తుంటే, మన రాష్ట్రంలో రూ.6500 వేతనాన్ని మాత్రమే ఇవ్వడం దారుణమన్నారు. చాలీచాలనీ వేతనంతో కుటుంబాన్ని ఏవిధంగా సాకాలని నిలదీశారు. ఖాళీగా ఉన్న 6 వేల యానిమల్ హస్బెండరీ అసిస్టెంట్ పోస్టుల్లో గోపాల మిత్రలకు అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేశారు. పైడిమాండ్ల సాధన కోసం మార్చి 11 కాకినాడ కలక్టరేట్ వద్ద జరిగే ధర్నాకి గోపాలమిత్రలు పెద్దఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో అసోసియేషన్ నాయకులు పి.అబ్బులు, టి.శ్రీనివాస్, బి.అప్పలరాజు పాల్గొన్నారు.

అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా జగన్ పాలన

ప్రజాశక్తి - పిఠాపురం

పట్టణంలోని స్థానిక రథాలపేట మెయిన్‌రోడ్డులో రూ.1.10 కోట్లతో నిర్మించిన అంబేద్కర్ భవనాన్ని కాకినాడ ఎంపీ వంగా గీత బుధవారం ప్రారంభించారు. తొలుత రథలపేట వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపీ గీత మాట్లాడారు. ఎంపీ నిధులు రూ.50 లక్షలు, సిఎస్ ఆర్ నిధులు రూ.60 లక్షలు మొత్తంగా రూ.1.10 కోట్లతో అంబేద్కర్ భవనాన్ని నిర్మించామన్నారు. నిధులు మంజూరుకు సహకరించిన ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా సిఎం జగన్ పాలన సాగిస్తున్నారన్నారు. కులమతాలకతీతంగా అర్హులైన పేదలందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ పి.జ్యోతి, జడ్‌పి వైస్ చైర్మన్ బుర్ర అనుబాబు, పలువురు కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు గండేపల్లి సత్యవెంకటరామారావు, ఖలీల్ అక్బర్‌పాషా, వైసిపి జిల్లా మహిళ విభాగం అధ్యక్షులు వర్ధినీడి సుజాత, వైసిపి జిల్లా స్పెషల్ స్పోక్స్ పర్సన్ నాగమల్లేశ్వరి, వైసిపి పట్టణాధ్యక్షుడు బి.దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ భవనం ప్రారంభోత్సవంలో దర్శనమిస్తునన సిఎం, ఎంపి, ఎంఎల్ఎ చిత్రపటాలు

రాజకీయ ప్రచారంగా ప్రారంభోత్సవం

అంబేద్కర్ భవనం ప్రారంభోత్సవం కార్యక్రమం అంతా రాజకీయ ప్రచారాన్ని తలపించింది. భవనం వద్ద అంబేద్కర్ పేరు గాని, కనీసం అంబేద్కర్ ఫ్లెక్సీగాని కానరాలేదు. బ్యానర్లు, ఫ్లెక్సీలు అన్నీ నాయకుల ఫోటోలు, వారి పేర్లకే పరిమితమయ్యాయి. భవనానికి పేరు కూడా రాయకుండా, కనీసం అంబేద్కర్ చిత్రపటాన్ని సైతం పెట్టకుండా ప్రారంభోత్సం నిర్వహించడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి.

జనసేనలో పలువురి చేరిక

ప్రజాశక్తి - కరప

కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న నానాజీ

మండలంలోని నడకుదురు గ్రామానికి చెందిన వైసిపి కార్యకర్తలు జనసేన పార్టీలో చేరారు. నడకుదురు గ్రామంలో బుధవారం జనసేన పార్టీ కార్యాలయాన్ని నియోజకవర్గ జనసేన, టిడిపి ఉమ్మడి అభ్యర్థి పంతం నానాజీ ప్రారంభించారు. ఈ సందర్భంగా వైసిపి నాయకుడు, మాజీ వైస్ ఎంపిపి యాసలపు దుర్గా ప్రసాద్‌తోపాటు, వైపిపికి చెందిన పలువురు జనసేన పార్టీలో చేరారు. ఈ సందర్భంగా నానాజీ వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. వాకలపూడి సంతోష్ నగర్ ప్రాంతంలోని వైసిపి నాయకుడు మెండు సందీప్ నాయకత్వంలో జనసేన పార్టీ నాయకులు గంటా ప్రసాద్, గేదల చిన్నరావు, ఎన్.శ్రీనివాస్, కె.శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో జనసేనలో చేరారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు భోగిరెడ్డి కొండబాబు, బోగిరెడ్డి గంగాధర్, బండారు మురళి, రెడ్డిపల్లి భాస్కర్ పాల్గొన్నారు.

ప్రచారంలో మంత్రి రాజా తనయుడు

ఎన్నికల ప్రచారంలో మంత్రి తనయుడు శంకర్ మాలిక్

ప్రజాశక్తి - కోటనందూరు

రాష్ట్ర మంత్రి దాడిశెట్టి రాజా తనయుడు శంకర్ మాలిక్ తుని పట్టణంలోని 25 వార్డులో ఎన్నికల ప్రచారాన్ని బుధవారం నిర్వహించారు. గడప గడపకూ ఆయన వెళ్లి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. రాబోయే ఎన్నికల్లో మరోసారి వైసిపిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరు సుధారాణి, రేలంగి రమణగౌడ్, షేక్ క్వాజా, పోతల లక్ష్మణ్, ఏలూరు బాలు, బోడపాటి సతీష్, పోతల రమణ తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్ పరిశ్రమ పార్టనర్ హరినాథరావు మృతి

ప్రజాశక్తి - సామర్లకోట

సుమారు 130 సంవత్సరాల చరిత్ర గల సామర్లకోట అంబటి సుబ్బన్న అండ్ కో ఆయిల్ మిల్ పరిశ్రమ పార్టనర్ సింగవరపు హరినాథరావు (71) బుధవారం మృతి చెందారు. గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో హైదరాబాదులోని ప్రయివేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. బుధవారం మధ్యాహ్నం పరిస్థితి విషమించి తుది శ్వాస విడిచారు. పరిశ్రమ వ్యవస్థాపకులు సింగవరపు సత్యనారాయణకు ఈయన రెండో కుమారుడు. ఈయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. గురువారం సామర్లకోటలో హరినాథరావు మృత దేహానికి అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబీకులు వెల్లడించారు.

మహిళలపై పెరుగుతున్న దాడులు

ప్రజాశక్తి - పెద్దాపురం

బిజెపి పాలనలో మహిళలపై దాడులు, హత్యలు, అత్యాచారాలు నిరంతరం పెరుగుతున్నాయని పిఒడబ్ల్యు డివిజన్ అధ్యక్షులు కె.లక్ష్మి అన్నారు. బుధవారం స్థానిక పాత బస్టాండ్ సమీపంలోని తాపీ వర్కర్స్ యూనియన్ భవనంలో జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ సభలో ఆమె మాట్లాడారు. బిజెపి పాలనలో మణిపూర్‌లో ఆదివాసి మహిళల నగ్న ఊరేగింపులు, సామూహిక అత్యాచారాలు ప్రపంచవ్యాప్తంగా చంచలనం కలిగించాయన్నారు. ఈ సమావేశంలో డివిజన్ కార్యదర్శి బి.శాంతి, పివైఎల్ రాష్ట్ర కార్యదర్శి వి.చిట్టిబాబు, మాట్లాడారు. రాబోయే ఎన్నికల్లో మహిళలు బిజెపికి బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు.

సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మి

హుండీల ఆదాయం రూ.1.82 కోట్లు

ప్రజాశక్తి - అన్నవరం

అన్నవరం సత్యనారాయణ స్వామి హుండీల లెక్కింపు ద్వారా రూ.1,82,53,984 ఆదాయం లభించింది. బుధవారం దేవస్థానం ఇఒ కె.రామచంద్ర మోహన్, చైర్మన్ ఐవి.రోహిత్ సమక్షంలో అధికారులు 34 రోజుల్లో వచ్చిన వివిధ హుండీల ఆదాయాన్ని లెక్కించారు. కానుకల రూపంలో 19 గ్రాముల బంగారం, 580 గ్రాముల వెండి, ఇంకా వివిధ దేశాలకు చెందిన కరెన్సీ నోట్లు లభించినట్లు దేవస్థానం అకౌంట్స్ విభాగం పర్యవేక్షణ అధికారి అనకాపల్లి ప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ మరియు ఎలక్ట్రికల్ అధికారులు, వివిధ విభాగాలు ఎఇఒలు, పురోహితులు, సేవకులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు స్థలాల పంపిణీ

ప్రజాశక్తి - రౌతులపూడి

నవరత్నాలు పథకంలో ఎంపికైన లబ్ధిదారులకు స్థలాల పంపిణీ కార్యక్రమం బుధవారం జరిగింది. నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జ్ వరుపుల సుబ్బారావు ఈ కార్యక్రమంలో పాల్గొని లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో శంఖవరం ఎంపిపి పర్వత రాజుబాబు, జడ్‌పిటిసి లక్ష్మణమూర్తి, వైసిపి నాయకులు వాసిరెడ్డి, డిప్యూటీ తహాశీల్దార్ సత్యనారాయణ, హౌసింగ్ ఎఇ ప్రసాద్, ఇతరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్షా సామగ్రి పంపిణీ

ప్రజాశక్తి - కరప



సామాగ్రిని అందిస్తున్న సర్పంచ్ పాలిశెట్టి తాతీలు

స్థానిక నక్కా సూర్య నారాయణమూర్తి జడ్‌పి ఉన్నత పాఠశాల 10వ తరసతి విద్యార్థులకు పరీక్షా సామాగ్రిని పంపిణీ చేశారు. కాకినాడకు చెందిన ఆచార్య ఐఐటి అండ్ మెడికల్ అకాడమీ జూనియర్ కాలేజ్ డైరెక్టర్ పివిడి ప్రసాద్ సాయంతో కాలేజీ ప్రతినిధులు బుధవారం గ్రామ సర్పంచ్ సాదె ఆశాజ్యోతి చేతుల మీదుగా అందజేశారు. పాఠశాలలో ఉన్న 204 మంది విద్యార్థులకు పరీక్ష ఫాడ్స్, పెన్ను, పెన్సిల్, రబ్బరు వంటి పరిక్షా సామాగ్రిని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పోలిశెట్టి తాతీలు, యర్రమాటి సతీష్, కునపరెడ్డి వీర్రాజు, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు .

కార్టూ'నిజం'

రేషన్ బస్తాలపై మోడీ చిత్రం కోసం కోట్లు వ్యయం

వచ్చే ఎన్నికల్లో వీళ్ల చిత్రాలు మారిస్తే గానీ లాభం లేదురా..!!

మల్లిసాలలో పోలీస్ కవాతు

పోలీసులకు సూచనలు ఇస్తున్న ట్రైనీ ఐపిఎస్

ప్రజాశక్తి - జగ్గంపేట

మండలంలోని మల్లిసాల గ్రామంలో బుధవారం స్థానిక సిఐ లక్ష్మణరావు ఆధ్వర్యంలో ప్రత్యేక పోలీస్ బలగాలు కవాతు నిర్వహించాయి. రానున్న ఎన్నికలలో పటిష్టంగా బందోబస్తు నిర్వహించేందుకు ప్రత్యేక బలగాలు రంగంలోకి దిగాయి. జగ్గంపేట ఎస్‌హెచ్‌ఒగా బాధ్యతలు చేపట్టిన ట్రైనీ ఐపిఎస్ నవజ్యోతి మిశ్రా పోలీస్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రశాంతకర వాతావరణంలో ఎన్నికలు సజావుగా జరిగేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. రాజకీయ పార్టీలు ఎన్నికల నియామవళిని తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఎన్నికల్లో ఎటువంటి శాంతిభద్రతల సమస్యలు లేకుండా పటిష్టమైన బందోబస్తును ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

శివరాత్రికి ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి - సామర్లకోట

భక్తుల సౌకర్యార్థం క్యూలైన్లలో బారికేడ్లు ఏర్పాటు

స్థానిక భీమేశ్వర ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాల ఏర్పాట్లు పూర్తి చేసి నట్లు ఇఒ నీలకంఠం తెలి పారు. బుధవారం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సవ ావేశంలో ఆయన మాట్లాడారు. శివరాత్రి ఉత్సవాలను అంకురార్పణ పూజాలతో ఘనంగా ప్రారం భించినట్లు చెప్పారు. శివరాత్రి పర్వదినం సందర్భంగా దర్శ నానికి వచ్చే భక్తుల కోసం అన్ని ఏర్పాట్లు చేసి నట్లు చెప్పారు. ఆ ఒక్కరోజు దర్శనానికి లక్షమందికి పైగా భక్తు లు చేరుకునే అవకాశం ఉన్నందున, అందుకు తగ్గట్టుగా అల్పా హారం, మజ్జిగ, పాలు, మధ్యాహ్నం భోజన సదుపాయాలు ఏర్పాటు చేసినట్టు ఆయన చెప్పారు. స్వచ్ఛంద సంస్థల ద్వారా ఉచిత సేవా కార్యక్రమాలు జరుగు తాయని తెలిపారు. భక్తుల సౌకర్యార్థం క్యూ లైన్‌లు, ఉచిత దర్శనం, శీఘ్ర దర్శనం, విఐపి దర్శనాలను ఏర్పాటు చేసినట్టు చెప్పారు. 9వ తేదీన జరిగే స్వామీ రథోత్సవానికి ఏర్పాట్లు చేశామని తెలిపారు. స్నానం ఘట్టాలు, ఆలయ పుసకారిణిల వద్ద గజ ఈత గాళ్ళను నియమించామని చెప్పారు. డిఎస్‌పి లతా కుమారి ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు, మున్సిపల్ కమిషనర్ జె రామారావు ఆధ్వర్యంలో ప్రత్యేక పారిశుధ్య నిర్వహణ, ఇంకా రెవిన్యూ, వైద్య ఆరోగ్య శాఖ సేవలను, వాలంటరీ ఆర్గనైజేషన్ సేవలు అందుబాటులో ఉంచుతున్నట్టు నీలకంఠం వెల్లడించారు.

నేరాలు ఘోరాలు

బియ్యాన్ని స్వాధీనం చేసుకుంటున్న అధికారులు

26 టన్నుల పిడిఎస్ బియ్యం స్వాధీనం

ప్రజాశక్తి-మండపేట

మండలంలోని తాపేశ్వరం గ్రామంలో విఘ్నేశ్వర మోడ్రన్ రైస్ మిల్ లో బుధవారం విజిలెన్స్ అధికారులు దాడులు చేసి 26.787 టన్నుల పిడిఎస్ బియ్యంతో పాటు 15 క్వింటాళ్ల విరిగిన బియ్యం, 50 క్వింటాళ్ల ఊక, 724 క్వింటాళ్ల ధాన్యం, 124.30 క్వింటాళ్ల రంగు మారిన ధాన్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు రీజనల్ విజిలెన్స్ ఎస్పి ఎస్.వి.సుబ్బారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెలగతోడుకు చెందిన ఏరుబండి సురేష్ మోటార్ సైకిల్ పై పిడిఎస్ బియ్యాన్ని రైస్మిల్ కు తరలిస్తుండగా పక్కా సమాచారంతో అతనిని అదుపులోకి తీసుకుని విచారించగా ఈ విషయం బయటపడిందన్నారు. ఈ నేపథ్యంలో రైస్ మిల్లు యజమాని కర్రి దత్తాత్రేయ గురు కష్ణారెడ్డి, బియ్యం తరలిస్తున్న సురేష్ లపై 6ఎ కేసు నమోదు చేశారు. ఈ దాడుల్లో విజిలెన్స్ అధికారులు ముత్యాల నాయుడు, నాగ వెంకటరాజు, విజయ్ కుమార్, అలీషా తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ అదృశ్యం

ప్రజాశక్తి - సామర్లకోట

మండలంలోని చంద్రంపాలెం గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ జక్కి వేణుగోపాల్ అదృశ్యంపై పోలీసులు కేసు నమోదు చేశారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈ నెల 4వ తేదీ రాత్రి 7 గంటల సమయంలో ఇంటి నుంచి బయలుదేరి మందులు కోసం ఆటో వేసుకుని కాకినాడ వెళ్లాడు. తిరిగి ఇంటికి రాలేదు. అతడు వేసికెళ్లిన ఆటో గొంచాల గ్రామ చివరలో ఉన్నట్లు గుర్తించారు. అతని ఆచూకి తెలిస్తే సామర్లకోట పోలీసులకు సమాచారం ఇవ్వాలని, ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి - గండేపల్లి

మండలం మల్లేపల్లి గ్రామంలో జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయాలపాలయ్యారు. హైవే పెట్రోలియం పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పెద్దాపురం చెందిన గోపాలం, స్వామి అనే వ్యక్తులు మోటార్ సైకిల్పై రాజమహేంద్రవరం వెళ్లుండగా స్కూల్ బస్సు ఒక్కసారిగా మీదకు రావడంతో ఒక్కసారిగా మోటార్ సైకిల్ను సడన్ బ్రేకు వేశారు. దీంతో అదుపు తప్పి రోడ్డుపై పడిపోవడంతో ఇద్దరూ గాయాలపాలయ్యారు. వీరిని జగ్గంపేటలోని ప్రయివేటు ఆసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

ఇద్దరికి జైలు శిక్ష

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

ఇద్దరు పిల్లలు, భార్యను వదిలి వేరే మహిళతో కాపరం చేస్తున్న భర్తతోపాటు, ఆ మహిళకు కాకినాడ స్పెషల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ జైలు శిక్ష విధించింది. ఈ కేసుకు సంబంధించిన వివరాలను సర్పవరం స్టేషన్ హౌస్ ఆఫీసర్ వైఆర్కె.శ్రీనివాస్ బుధవారం వెల్లడించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అయినవిల్లి మండలం సిరిపల్లి గ్రామానికి చెందిన పాము సుధారాణికి కాకినాడ సర్పవరం గ్రామానికి చెందిన పాము సుబ్రహ్మణ్యంతో 2007లో వివాహం జరిగింది. ఆ సమయంలో రూ.6 లక్షలతోపాటు, బంగారాన్ని కట్నంగా ఇచ్చారు. వారికి ఇద్దరు ఆడపిల్లల జన్మించారు. కొంతకాలానికి భర్త సుబ్రహ్మణ్యం మరో పి.నాగమణి అనే మహిళతో సంబంధం పెట్టుకుని భార్యను శారీరకంగా, మానసికంగా చిత్రహింసలకు గురిచేశాడు. దీంతో ఆమె స్టేషన్లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. ఈ కేసుపై కోర్టు విచారించి బుధవారం భర్త సుబ్రహ్మణ్యానికి 3 సంవత్సరాల జైలు శిక్షతోపాటు, రూ.4 వేలు జరిమానా, పి.నాగమణికి నెల రోజులు జైలు శిక్షతోపాటు, రూ.1000 జరిమానా విధించారు. బాధితురాలు తరపున కాకినాడ స్పెషల్ మొబైల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు ఎపిపి జి.విజయ వాదనలు వినిపించారు.

పేరవరంలో అగ్ని ప్రమాదం

ప్రజాశక్తి-ఆత్రేయపురం

మండలంలోని పేరవరం గ్రామంలో బుధవారం ఉదయం భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో సుమారు రూ.15 లక్షల ఆస్తి నష్టం సంభవించింది. గ్రామానికి చెందిన చిట్టురి కామేశ్వర రావుకు చెందిన సప్లై కంపెనీ ఉదయం ఒక్కసారిగా ఉన్నటువంటి మంటలు చెలరేగడంతో ఈ ప్రమాదం సంభవించింది. ఆటో, మోటార్ సైకిల్, మూడు జనరేటర్లు విలువైన టెంట్ హౌస్ సామగ్రి పూర్తిగా దగ్ధమయ్యాయి. ఈ ప్రమాదానికి సంబంధించి కారణాలు తెలియ రాలేదు. దీనిపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి

8 కేజీల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని పురుషోత్తపట్నం ఏటిగట్టుపై పోలీసులు దాడి చేసి 8 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. సీతానగరం ఎస్ఐ రామకష్ణ తెలిపిన వివరాల మేరకు.. పోలీసులకు అందిన సమాచారం మేరకు పురుషోత్తపట్నం ఏటిగట్టుపై తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో గ్రామ శివారు ఆర్చ్ వద్ద గంజాయి రవాణా చేస్తున్న తమిళనాడుకు చెందిన పి.ముత్తు(43)ను పోలీసులు పట్టుకున్నారు. అతని నుంచి 8 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. కొంతకాలంగా అల్లూరి సీతారామరాజు జిల్లా నుంచి తూర్పుగోదావరి మీదుగా తమిళనాడుకు గంజాయిని తరలిస్తున్నట్టు సమాచారం ఉందన్నారు. ఈ క్రమంలో పురుషోత్తపట్నం మీదుగా గంజాయి రవాణా చేస్తుండగా పోలీసులు దాడులు చేశారు.

గంజాయితో నిందితుడు

ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని కాపాడండి:యనమల

ప్రజాశక్తి - కోటనందూరు

బహిరంగ సభలో మాట్లాడుతున్న యనమల రామకృష్ణుడు

రానున్న ఎన్నికల్లో ఓటు హక్కును సద్వినియోగం చేసుకొని ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని కాపాడాలని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు యనమల రామకృష్ణుడు ప్రజలను కోరారు. బుధవారం రాత్రి టిడిపి మండల అధ్యక్షులు గాడి రాజబాబు, మాజీ ఎంపిపి దంతులూరి చిరంజీవ రాజు ఆధ్వర్యంలో బహిరంగ సభ నిర్వహించారు. ఈ సభలో మాజీ మంత్రులు యనమల రామకృష్ణుడు, చింతకాయల అయ్యన్న పాత్రుడు హాజరయ్యారు. తొలుత యనమల మాట్లాడారు. ఓటును అమ్ముకుంటే జీవితాలు నాశనమవుతాయన్నారు. వ్యవస్థ దుర్వినియోగం అవుతుందన్నారు. నేడు పాలించే పాలకులంతా వ్యాపారస్తులేనన్నారు. అక్రమంగా సంపాదించిన ధనంతో ఓటర్లను ప్రలోభ పెట్టి, ఓట్లను కొనుగోలు చేసుకుంటున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో ఇలాంటి నాయకులకు ప్రజలు చెక్ పెట్టాలన్నారు. అనంతరం మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు మాట్లాడారు. హామీలను అమలు చేయడంలో జగన్మోహన్రెడ్డి పూర్తిగా విఫలమయ్యారన్నారు. రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టేశారన్నారు. బ్రాందీషాపులపై రూ.8,300 కోట్లు అప్పు తెచ్చారన్నారు. 25 ఏళ్లకు ఒప్పందం కుదుర్చుకొని మద్యం దందా నిర్వహిస్తున్నారని విమర్శించారు. ప్రజల సొంత భూములను, ఆస్తులను స్వాధీనం చేసుకుని వాటిపై అప్పులు చేసే ఆలోచనలో జగన్మోహన్రెడ్డి ఉన్నారన్నారు. టిడిపి తుని నియోజకవర్గ ఇన్ఛార్జి యనమల దివ్య మాట్లాడుతూ తనను గెలిపిస్తే తాండవ రిజర్వాయర్ను అభివృద్ధి చేస్తానన్నారు. అనంతరం కోటనందూరుకు చెందిన నాయకుల వి.వెంకట గంగాధర్రంగ నాయకులు, వెలగా వెంకటకృష్ణారావు, కోన వీరబాబు, పల్లా రామకృష్ణుడు ఆధ్వర్యంలో పలువురు టిడిపిలో చేరారు. వారికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు.

పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఎంపి గీత

ప్రజాశక్తి - పిఠాపురం

పట్టణంలోని పలు అభివృద్ధి పనులకు వైసిపి నియోజకవర్గ ఇన్ఛార్జ్, ఎంపి వంగా గీత శంకుస్థాపనలు చేశారు. స్థానిక 9వ వార్డులో రూ.26 లక్షలతో నిర్మించబోయే బాక్స్ కల్వర్ట్కు శంకుస్థాపన చేశారు. అదే వార్డ్ లో రూ.29 లక్షలతో నిర్మించిన పార్కును ప్రాంభించారు. 8వ వార్డులో సిఎస్ఆర్ నిధులతో డ్రైవర్స్ కాలనీలో కాపు కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భముగా ఎంపి మాట్లాడుతూ సిఎం జగన్ పాలనలో నియోజక వర్గాన్ని అన్నివిధాలుగా అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పి వైస్ చైర్మన్ బి.అనుబాబు, 8, 9వ వార్డుల కౌన్సిలర్లు బోనసుల శివ, పెదపాటి నాగేశ్వరరావు, కో అప్షన్ సభ్యులు గండేపల్లి సత్య వెంకట రామారావు, వైసిపి జిల్లా మహిళ విభాగం అధ్యక్షురాలు వర్ధినీడి సుజాత, వైసిపి జిల్లా అధికార ప్రతినిధి నాగమల్లేశ్వరి, మున్సిపల్ కమిషనర్ కనకరావు పాల్గొన్నారు.

ఎన్నికలు సజావుగా సాగేందుకు సహకరించాలి

ప్రజాశక్తి - కాకినాడ

రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న కలెక్టర్ కృతికా శుక్లా

రానున్న సార్వత్రిక ఎన్నికలను జిల్లాలో ప్రశాంత, ఆదర్శ వాతావరణంలో సజావుగా నిర్వహించేందుకు సహరించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ కృతికాశుక్లా రాజకీయ పార్టీలను కోరారు. బుధవారం కలెక్టరేట్లో జిల్లాలోని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులకు లోక్ సభ, అసెంబ్లీ ఎన్నికలు నిర్వహణ అంశాలపై ప్రత్యేక అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి, ఫ్లయింగ్ స్క్వాడ్లు, నామినేషన్ల ప్రక్రియ, ఎన్నికల వ్యయం అకౌంటింగ్, ఎంసిఎంసి, నోడల్ అధికారుల విధులు, సి-విజిల్ యాప్ వినియోగం వంటి అన్ని అంశాలపై రాజకీయ పార్టీల ప్రతినిధులకు జిల్లా ఎన్నికల విభాగం అధికారులు అవగాహన కల్పించి, సందేహాలను నివృత్తి చేశారు. ఎన్నికల ప్రవర్తన నియమావళికి సంబంధించి రాజకీయ పార్టీలు, పోటీలోని అభ్యర్థులు పాటించాల్సిన అంశాలను వివరించారు. అలాగే ఓటర్ల జాబితా, మార్పులు, చేర్పులు, తొలగింపు దరఖాస్తుల పరిష్కారం, 18-19 సంవత్సరాల ఓటర్లు, కౌంటింగ్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్ లు, రిసెప్షన్, డిస్ట్రిబ్యూషన్ సెంటర్లు, ఇవిఎం, వివిప్యాట్ ల వినియోగంపైనా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం సూచించిన మార్గదర్శకాలను ఖచ్చితంగా పాటించాలన్నారు. జిల్లాలో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు సహకరించాలన్నారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన నాటి నుంచి ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులోకి వస్తుందని తెలిపారు. ఎన్నికల ప్రక్రియ అంతా పూర్తయ్యేవరకు అమల్లో ఉంటుందన్నారు. పబ్లిసిటీ నిమిత్తం వినియోగించే లౌడ్ స్పీకర్స్, వాహనాలకు రాజకీయ పార్టీ అభ్యర్థులు ముందుగానే అనుమతులు తీసుకోవాలన్నారు. జిల్లాలో ఎన్నికల ప్రవర్తన నియమావళికి సంబంధించి జిల్లా విద్యాశాఖ అధికారి నోడల్ అధికారిగా వ్యవహరిస్తారని, ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘన జరుగకుండా నియమావళిపై పూర్తి స్థాయిలో అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో డిఎల్డిఒలు పి.నారాయణమూర్తి, కెవిఎస్వి.ప్రసాద్రాజు వివిధ అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు రావూరి వెంకటేశ్వరరావు (వైసిపి), గదుల సాయిబాబా (టిడిపి), పెద్దిరెడ్డి రవికిరణ్ (బిజెపి) సబ్బారపు అప్పారావు (బిఎస్పి), వల్లూరి రామ్మోహన్(కాంగ్రెస్) కాళ్ళూరి కృష్ణమోహన్ (ఆప్) ఎన్నికల విభాగం టిడి ఎం.జగన్నాథం, తదితరులు పాల్గొన్నారు.

మహాశివరాత్రి పూజలు ప్రారంభం

ప్రజాశక్తి - సామర్లకోట

పూజలు చేస్తున్న భక్తులు

ఈనెల 9వ తేదీ వరకు జరగనున్న మహాశివరాత్రి ఉత్సవాలు సామర్లకోట భీమేశ్వర స్వామి వారి ఆలయంలో బుధవారం పాంచాహ్నిక దీక్షతో ప్రారంభమయ్యాయి. ఉదయం నంది మండపంలో ఆలయ ఇఒ బల్ల నీలకంఠం ఆధ్వర్యంలో ఆలయ అర్చకులతో విగ్నేశ్వర పూజతో దీక్షాధారణ పూజలు నిర్వహించారు.శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఉత్సవమూర్తులను ఇత్తడి నంది వాహనంపై ఉంచి మేళతాళాలతో పట్టణ వీధులలో గ్రామోత్సవం నిర్వహించారు. పూజల్లో ఆలయ అర్చకులు వెంకన్నబాబు, సుందర రామయ్యశర్మ, భీమే శ్వరశర్మ, సోమేశ్వరశర్మ, ఆలయ సూపరెంటెండెంట్ ఈశ్వరరావు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

భీమేశ్వరుని కళ్యాణానికి కొబ్బరి బొండాలు

ప్రజాశక్తి - పెదపూడి

బొండాన్ని ఇస్తున్న కుటుంబీకులు

మండలంలో గొల్లలమామిడాడకు చెందిన వ్యాయామ దర్శకులు లయన్ ద్వారంపూడి యువరాజ రెడ్డి మహాశివరాత్రి సందర్భంగా భీమేశ్వర స్వామికి కొబ్బరి బొండాలు అంద చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ గత రెండేళ్లగా స్వామి కళ్యాణానికి కొంబరి బొండాలను అలంకరించి ఇస్తు న్నట్లు తెలిపారు. ఈ బొండాలను కళ్యా ణంలో వినియోగించాలని ఆలయ కమి టీని, అర్చకులను కోరినట్లు చెప్పారు. గ్రామంలోని ప్రజలు పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని స్వామి కళ్యాణానికి 3వ ఏడాది కొబ్బరి బొండాలను అందించినట్లు తెలిపారు.

పార్టీలో చేరిన వారితో దవులూరి

వైసిపిలో పలువురు చేరిక

ప్రజాశక్తి - పెద్దాపురం

పట్టణానికి చెందిన కనకదుర్గ తోపుడుబండ్ల సంఘం, శ్రీ నూకంబిక వడ్రంగి సంక్షేమ సంఘాలకు చెందిన పలువురు వైసిపిలో చేరారు. మున్సిపల్ చైర్పర్సన్ బొడ్డు తులసి మంగతాయారు అధ్యక్షతన జరిగిన సభలో వారికి వైసిపి నియోజకవర్గ ఇన్ఛార్జ్ దవులూరి దొరబాబు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం జగన్ పాలనలో జరుగుతున్న సంక్షేమ పథకాల పట్ల ప్రజలు ఆకర్షితులౌతున్నారని అన్నారు. రాబోయే ఎన్నికల్లో వైసిపి విజయానికి శక్తి వంచన లేకుండా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్లు నెక్కంటి సాయి ప్రసాద్, కనకాల మహాలక్ష్మి, అగ్రో డైరెక్టర్ సయ్యద్ జానీ, ఆయా వార్డుల కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు వాసంశెట్టి గంగ, షేక్ రఫీ, తాడి రాజశేఖర్ పాల్గొన్నారు.

దంత వైద్యుల దినోత్సవం

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

స్థానిక అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ దంత వైద్యుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ దంత వైద్యులు, జాతీయ అవార్డు గ్రహీత డాక్టర్ అడ్డాల సత్యనారాయణ మాట్లాడుతూ మనం తీసుకునే ఆహారం జీర్ణం కావాలంటే దంతాలు ముఖ్యమన్నారు. దంతాల సంరక్షణపై ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలని తెలిపారు. దంత సంబంధిత రుగ్మతలపై గ్రామీణ ప్రజలకు సరైన అవగాహన లేక దంతాల సంబంధిత వ్యాధుల బారిన పడుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో అడబాల రత్న ప్రసాద్, సువర్ణరాజు, రాఘవరావు, కుమార్ యాదవ్ పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళిపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - పెద్దాపురం

ఎన్నికల ప్రవర్తనా నియమావళిపై విధుల్లో పాల్గొనే ప్రతి ఒక్కరికి పూర్తి అవగాహన ఉండాలని రిటర్నింగ్ అధికారి, ఆర్డిఒ జె.సీతారామారావు అన్నారు. బుధవారం స్థానిక ఆర్డిఒ కార్యాలయంలో బుధవారం మాస్టర్ ట్రైనీస్, ఎఇఆర్ఒలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 9న జరిగే అవగాహన సదస్సులో ఇవిఎంలపై, ఎన్నికల ప్రవర్తన నియమావళిపై పిఒ, బిఎల్ఒలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. ఈ సదస్సులో పెద్దాపురం తహశీల్దార్ శ్రీనివాస్రెడ్డి, సామర్లకోట తహశీల్దార్ శ్రీనివాస్, మాస్టర్ ట్రైనీలు జాన్కెనడి, సీతారామారావు పాల్గొన్నారు.

సంపూర్ణ అవగాహన అవసరం

ప్రజాశక్తి - కాకినాడ

రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న కమిషనర్

ఎన్నికల ప్రక్రియపై అన్ని రాజకీయ పార్టీలకు సంపూర్ణ అవగాహన ఎంతో అవసరమని కాకినాడ సిటీ నియోజకవర్గ ఇఆర్ఒ, కమిషనర్ జె.వెంకటరావు అన్నారు. తన కార్యాలయంలో బుధవారం పలు రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల ప్రవర్తనా నియమా వళిని వారికి వివరించారు. ఎన్నికల సందర్భంగా అభ్యర్థులు చేసే ఖర్చుల వివరాలను ఎలా సమర్పించాలి? నామినేషన్ దాఖలు చేసే సమయంలో తాజాగా విడుదలైన మార్గదర్శ కాలను వివరించారు. సువిధ యాప్, పోస్టల్ బ్యాలెట్ విధానాన్ని వివరించారు. 80 ఏళ్ళు దాటిన వృద్ధులు, 40 శాతం వైకల్యంతో బాధపడే వారిని గుర్తించి బిఎల్ఒల ద్వారా నివేదిక సిద్ధం చేశామన్నారు. వీరందరి ఇళ్ళ విద్దకు వెళ్ళి హోం ఓటింగ్ ప్రక్రియ ద్వారా ఓట్లు వేయించే విధానాన్ని వివరించారు. ఎన్నికలు సజావుగా నిర్వహించడంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు తమ వంతు తోడ్పాటు అందించాలని, ఏమైనా సందేహాలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఇవిఎంల పనితీరుపై ప్రత్యక్షంగా అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో బెజవాడ బాబి(వైసిపి), గట్టి సత్య నారాయణ(బిజెపి), మల్లిపూడి వీరు, తుమ్మల రమేష్(టిడిపి), ఎఇఆర్ఒలు సీతాపతిరావు, హరిదాసు, నాగశాస్త్రులు, జాన్బాబు పాల్గొన్నారు.

పుట్టుకతో లోపాలు ప్రాణాంతకం

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

సమావేశంలో మాట్లాడుతున్న కుమార్యాదవ్

పుట్టుకతో వచ్చే లోపాలు ప్రాణాంతకంగా మారుతున్నాయని దీనిపై గర్భిణీలకు ముందస్తు జాగ్రత్తలు అవసరమని ఆర్ఎంపీ వైద్యులు కుమార్ యాదవ్ అన్నారు. బోటు క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో ప్రపంచ పుట్టుక లోపాల నివారణ దినోత్సవం సందర్భంగా బుధవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. నవజాత శిశువులకు శస్త్ర చికిత్సలు తీయడానికి వారి శరీర అవయవాలు సహకరించవని అన్నారు. ఈ శస్త్ర చికిత్సకు వైద్య ఖర్చులు కూడా అధికమన్నారు. పోషకాహార లోపం, మేనరిక వివాహాలు పుట్టుకలో వచ్చే లోపాలకు ఒక కారణమన్నారు. ఈ కార్యక్రమంలో అడబాల రత్న ప్రసాద్, రాఘవరావు, సత్యనారాయణ చౌదరి పాల్గొన్నారు.

స్థలాల రిజిస్ట్రేషన్ పత్రాల పంపిణీ

ప్రజాశక్తి - కాకినాడ

పట్టాలను అందిస్తున్న ఎంఎల్ఎ ద్వారంపూడి

నగరంలోని పలు వార్డులకు చెందిన లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ పత్రాలను పంపిణీ చేశారు. స్థానిక జగన్నాథపురంలో 18, 20, 21, 22 డివిజన్లకు సంబంధించి ముస్లిం కమ్యూనిటీహాలు వద్ద, 23, 24, 25, 26 డివిజన్లకు సంబంధించి ముగ్గుపేట మెయిన్రోడ్డు వద్ద జరిగిన కార్యక్రమాల్లో నవరత్నాలు -పేదలందరికీ ఇళ్ళు పథకంలో ఇచ్చిన స్థలాలకు రిజిస్ట్రేషన్ పత్రాలను ఎంఎల్ఎ చంద్రశేఖర్రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇళ్ళ స్థలాల పంపిణీ, గృహనిర్మాణాలు గతంలో ఎప్పుడూ జరిగిన దాఖలాలు లేవన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 30 లక్షల మందికి పట్టాలు ఇచ్చిన ఘనత ఎపి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. స్థలాలతోపాటు, ఇళ్ల నిర్మాణాలను చేపట్టడం సిఎం చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్సి కర్రి పద్మశ్రీ, అదనపు కమిషనర్ సిహెచ్.నాగనరసింహారావు, వైసిపి నగరాధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, ఎంసి చైర్పర్సన్ పసుపులేటి వెంకటలక్ష్మి, నగరపాలక సంస్థ కార్యదర్శి ఎం.ఏసుబాబు, మాజీ డిప్యూటీ మేయర్ మీసాల ఉదయ్కుమార్, రాష్ట్ర వక్స్ బోర్డు మాజీ డైరెక్టర్ అబ్దుల్ బషీరుద్దీన్, మాజీ కార్పొరేటర్లు పాల్గొన్నారు.

యానాం వార్తలు

భూమి పూజ చేస్తున్న ఎంఎల్ఎ అశోక్

రోడ్డు నిర్మాణానికి భూమి పూజ

ప్రజాశక్తి - యానాం

యానాం కనకాలపేటలోని ఆదిఆంధ్ర పేటలో ప్రజా పనుల శాఖకు చెందిన సుమారు రూ.21.30 లక్షల వ్యయంతో నిర్మించే రోడ్డు నిర్మాణానికి ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ రోడ్డు నిర్మాణం పనులను త్వరితగతిన, నాణ్యతతో నిర్మించాలని కాంట్రాక్టర్కు సూచించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఎంఎల్ఎను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఒఒ మునిస్వామి, పిడబ్ల్యూడి ఇఇ చంద్రశేఖరన్, ఎఇ కాళ్ల నాగరాజు, పిల్లి భాస్కర్, బొడ్డు ప్రసాద్ పాల్గొన్నారు.

వైభవంగా 'ధనలక్ష్మి' వార్షికోత్సవం

ప్రజాశక్తి - యానాం

యానాం గోపాల్ నగర్లోని రామరాజు గార్డెన్లో ఉన్న ధనలక్ష్మి కళ్యాణలక్ష్మి అమ్మ ప్రథమ వార్షికోత్సవం ఆలయ నిర్వహకులు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం అలంకరించిన వాహనంపై అమ్మవారిని మేళ తాళాలతో ప్రధాన రహదారుల గుండా ఊరేగించారు. గారిడీ, కోబ్రా డాన్సులతోపాటు, వివిధ రకాల నృత్య ప్రదర్శనలు భక్తులను ఆకట్టుకున్నాయి. యాత్రికులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రథమ వార్షికోత్సవాన్ని జయప్రదం చేసిన భక్తులకు ఆలయ నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థులకు ఎప్పుడూ సహకరిస్తాం

ప్రజాశక్తి - పెద్దాపురం

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సహాయ సహకారాలు అందిస్తామని ఎస్ఆర్ఆర్, ఎస్కెఎం విద్యా సంస్థల డైరెక్టర్లు కుంచే చినబాబు, వి.చక్రం అన్నారు. బుధవారం కళాశాలలో ప్రిన్సిపల్ వివిఎస్ చక్రవర్తి అధ్యక్షతన జరిగిన సభలో పెద్దాపురం, గండేపల్లి, రంగంపేట మండలాలకు చెందిన 10వ తరగతి విద్యార్థులకు అవసరమైన పరీక్ష అట్టలు, పెన్నులు పంపిణీ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఏదో రూపంలో సాయం చేయాలనే భావనతో ముందుకు సాగుతున్నామని అన్నారు. భవిష్యత్లోనూ తమ వంతు సహాయ సహకారాలు కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్లు ఏసుబాబు, మధుసూదన్రావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఓటు వినియోగంపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక మహారాణి కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ - 5 పిఒ మేడిశెట్టి తాతాజీ ఆధ్వర్యంలో బుధవారం రాజీవ్, ఎన్టీఆర్ కాలనీల్లో ఓటు హక్కు వినియోగంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ఇంటింటికి వెళ్లి 18 సంవత్సరాలు నిండి ఇప్పటి వరకు ఓటు హక్కు లేని వారిపై సర్వే చేశారు. రాజీవ్ కాలనీలో 84 మంది, ఎన్టిఆర్ కాలనీలో 161 మంది ఓటు నమోదు కాని వారిని గుర్తించినట్లు పిఒ తాతాజీ తెలిపారు. ఈ సర్వే రిపోర్టును తహశీల్దార్కు అందించి వారికి ఓటు నమోదు చేసేలా కృషి చేస్తామన్నారు.

స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తా

ప్రజాశక్తి - కాకినాడ

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న అన్నవరం

రానున్న ఎన్నికల్లో కాకినాడ రూరల్ నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తానని రమ్య ఆసుపత్రి అధినేత డాక్టర్ పితాని అన్నవరం తెలిపారు. బుధవారం తన ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రూరల్ ఎంఎల్ఎగా ఉన్న కురసాల కన్నబాబు రాబోయే ఎన్నికల్లో పోటీ చేసినా ఓటమి తప్పదని తన వద్ద అనేక మంది కార్యకర్తలు చెప్తున్నారని తెలిపారు. రూరల్ నియోజకవర్గంలో పితాని అన్నవరం చారిటబుల్ ట్రస్ట్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించి ప్రజల మన్ననలు పొందానని తెలిపారు. గడచిన ఐదేళ్ల కాలం నుంచి కాకినాడ రూరల్ అసెంబ్లీ పరిధిలో ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను దగ్గరుండి చూసినట్లు తెలిపారు. వాటిని అధిగమించి సుపరిపాలన అందించాలని అభిప్రాయం తన మనసులో కలిగిందన్నారు. జగన్పై ఉన్న అభిమానంతోనే తాను పార్టీకి సేవలందిస్తున్నానని తెలిపారు. తన సేవలను మెచ్చిన వైసిపి కార్యకర్తల నుంచి వస్తున్న ఒత్తిడితో స్వతంత్రం గానైనా పోటీ చేయాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు.

వైసిపి ఎన్నికల ప్రచారం


ప్రచారం నిర్వహిస్తున్న ముత్యాల శ్రీనివాస్

ప్రజాశక్తి - జగ్గంపేట

మండలంలోని కృష్ణాపురం, రాజపూడి, గోవిందపురం గ్రామాల్లో వైసిపి నాయకుడు ముత్యాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. బుధవారం చేపట్టిన ఎన్నికల ప్రచారంలో ఆయన వైసిపి శ్రేణులతోపాటు, ప్రజలను కలుసుకుని రాబోయే ఎన్నికల్లో వైసిపి ఎంపి అభ్యర్థి చలమలశెట్టి సునీల్, ఎంఎల్ఎ అభ్యర్థి తోట నరసింహంను గెలిపించాలని కోరారు. గత ఐదేళ్ల పాలనలో అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తూ ప్రజల మన్ననలను వైసిపి గెలుసుకుందన్నారు. సంక్షేమ పథకాలు నిరంతరం అమలు కావాలంటే మరోసారి జగన్ను సిఎంగా గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. ఓటమి భయంతో ప్రభుత్వంపై ప్రతిపక్షాలు బురదచల్లేందుకు కుట్రలు సాగిస్తున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప్పలపాడు సొసైటి ఛైర్మన్ పాము సూరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కాకినాడవారి కోర్టులో

I.A. 112/2024 in O.S. 140/2024

Between:

బొజ్జా రామకృష్ణ ...పిటీషనర్ / వాది

మరియు

1) కోలా చిన్నారావు

2) గుడివాడ రవి ప్రసాద్...రెస్పాండెంట్స్ / ప్రతివాదులు

పై నెంబరు గల దావా పిటీషన్ ద్వారా పిటీషనర్ మొదటి ప్రతివాది నుంచి తనకు మరియు ఇతర క్రెడిటార్స్కు రావలసిన బకాయిలు కప్పిబుచ్చి తన యొక్క దిగువ షెడ్యూలు ఆస్తిని 2వ ప్రతివాది పేరున బదలాయించినందున పిటీషనర్ తన తరుపున మరియు జనరల్ పబ్లిక్ తరుపున పై నెంబరు దావా దాఖలు చేసినందున ఎవరికైన ఆక్షేపణలు ఉన్నచో పై కోర్టువారి ఎదుట **ది. 14-03-2024వ తేదీన ఉదయం గం. 10-30 ని॥లకు** మీరు స్వయముగా గానీ, ప్లీడరు గారి ద్వారా గానీ హాజరు అయి తెలియజేసుకొనవలెను. లేనిచో ఆక్షేపణలు లేవని తీర్మానించబడును.

షెడ్యూల్: తూ॥గో॥ జిల్లా, ప్రస్తుతం కాకినాడ జిల్లా, సామర్లకోట సబు-రిజిస్ట్రీ పనసపాడు గ్రామం, అచ్చంపేట గ్రామ పంచాయితీ, పట్టా నెం. 263 తాలూకు సర్వే నెం. 77-14లో 484 చ॥గ॥లు స్థలములో దక్షిణంవైపున 204.08 చ॥గ॥లు స్థలములో డో.నెం. 1-20 గల 900 చ॥అడుగులు విస్తీర్ణం కలిగిన ఆర్.సి.సి. డాబా ఇల్లుకు హద్దులు: **తూర్పు:** అ. 40 లు - 30 అడుగులు వెడల్పుగల రోడ్డు; **దక్షిణం:** అ. 46 లు - దారి మార్గము తదుపరి ఇతరుల పెంకుటిల్లు; **పడమర:** అ. 39 లు - ఇతరుల ఆస్తి; **ఉత్తరం:** అ. 47 లు - తుమ్మల వెంకటేశ్వరరావు కొంతమేర, దారి మార్గం కొంతమేర మరియు తదుపరి ఇతరుల పెంకుటిల్లు.

పై హద్దుల మధ్యస్థమైన ఆస్తి అన్ని ఈజిమెంటు హక్కులు, ద్వారబంధములు, కిటికీలతో సహా.

// ఇది శ్రీ కోర్టువారి ఆర్డరు ప్రకారం జారీ చేయబడినది //

కాకర వెంకటేశ్వరరావు,
పి.వి.ఎస్.ఆర్. మూర్తి, అడ్వకేట్స్
కాకినాడ.
ది.05-03-2024
కాకినాడ,
సెల్: 9848006149

KAKINADA MUNICIPAL CORPORATION

WALK-IN-INTERVIEW

Roc. No.7170/2008/F1 **Dt.05-03-2024**

For the posts of Staff Nurse and Pharmacist (Purely on Contract Basis) to work at First Referral Unit Hospital, Jagannadhapuram, Kakinada.

S.No.	Post Name	Category	Qualifications
1	Staff Nurse (Women)-1 post	ST (W)	1. Intermediate and General Nursing and Mid-wifery Course or 2. MPHA 18 months and General Nursing & Mid-wifery course or 3. B.Sc Nursing / M.Sc. Nursing from recognized Nursing Institute 4. Must be registered with Andhra Pradesh Nursing Mid-wifery Council registration with latest
2	Pharmacist 1 post	General	Intermediate and Diploma in Pharmacy or Higher qualification and must be registered in A.P. Pharmacy Council

Interested and Eligible Candidates may attend the Walk-in-Interview to be held at 3.00 PM on 11-03-2024 at Health Officer Chamber, Municipal Corporation, Nehru Bala Bhavan, Gandhi Nagar, Kakinada along with filled in application form, attested copies of testimonials & Bio-data.

For further details contact in Public Health Section, Municipal Corporation, Nehru Bala Bhavan, Gandhi Nagar, Kakinada during the office working hours & days.

Sd/- **ADDITIONAL COMMISSIONER**
MUNICIPAL CORPORATION, KAKINADA